క్లుప్తంగా

అర్హులందరికీ భూ పంపిణీ



రైతులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: అర్హులందరికీ ప్రభుత్వం భూ పంపిణీ చేసేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన సొసైటీ భూములను 8వ విడత భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇటీవల చిగిచెర్ల గ్రామంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో భూ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే అప్పట్లో మిగిలిపోయిన అర్హత ఉన్న రైతులకు గురువారం ఎమ్మెల్యే తన గృహంలో పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూమి లేని వారికి భూములను పంపిణీ చేస్తుంటే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కడుపు మంటతో ఏదో విధంగా అడ్డు తగులుతున్నారన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా అర్హులందరికీ భూ పంపిణీ చేస్తామని వెల్లడించారు. అభివృద్ధి నిరోధకులను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగానందరెడ్డి, వైస్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ చిగిచెర్ల శ్రీనివాసరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ లైట్లతో విద్యుత్ పొదుపు



ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

కదిరి టౌన్: స్థానిక విద్యుత్ కార్యాలయంలో గురువారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించినట్లు విద్యుత్ డీఈ మోసెస్ తెలిపారు. ఈనెల 14 నుంచి డిసెంబర్ 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు జరుగుతాయన్నారు. విద్యుత్‌ను వృథా కాకుండా కాపాడుకుందామని తెలిపారు. ఇంధనాన్ని పొదుపుగా వాడకపోతే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. సంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులు వాడాలని సూచించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏడీఏ షాజహాన్, ఏఈలు శ్రీనివాసనాయక్, చెన్నకృష్ణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పార్థసారధి నగర్‌కు చెందిన రమేష్ గురువారం రాత్రి తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణం నుంచి కొత్తచెరువుకు వెళ్తున్న కారు రమేష్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అతడ్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంకేపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముదిగుబ్బ: మండల పరిధిలోని సంకేపల్లిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ ప్రసన్న గోపాల్, మాజీ సర్పంచ్ రవి, సచివాలయ కన్వీనర్ రాజు, హరీష్, నారాయణరెడ్డి, నారాయణస్వామి, కృష్ణమ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప గ్రామోత్సవం



ఎమ్మెల్యే కేతిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఎన్పీకుంట: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం అయ్యప్ప గ్రామోత్సవాన్ని మాలధారులు ఘనంగా నిర్వహించారు. తొలుత అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు నెయ్యి, గంధం, విభూది, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామిని డప్పు వాయిద్యాలతో మండల కేంద్రంలోని పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామికి కాయ, కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి రఘునాథ, అయ్యప్ప మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్ట సమీపంలోని అయ్యప్ప స్వామి భజన మందిరంలో గురుస్వామి పి.జె.విజయ్‌కుమార్ గురువారం పూజలు నిర్వహించారు. అనంతరం వందలాది మందికి అన్నదానం చేశారు. పూజల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను అయ్యప్ప మాలధారులు శాలువాతో సత్కరించారు.

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: గడచిన నాలుగున్నరేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించినట్లు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం సిద్దరాంపురం సచివాలయం పరిధిలోని దూపంపల్లి, లింగప్పగారిపల్లి, చంద్రాయునిపల్లి, తరుగువాండ్లపల్లి, కొట్టాలపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా పథకాలు అందించారని కొనియాడారు. గతంలో దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. జగన్ పాదయాత్రలో చెప్పిన విషయాలతో పాటు ఎన్నికల హామీల్లో 98 శాతం నెరవేర్చారని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి ఒక్కో కుటుంబంలో సరాసరి రూ.50 నుంచి రూ.లక్షన్నర దాకా ఇప్పటికే లబ్ధి పొందారని వివరించారు. సీఎం జగన్, విద్యా, వైద్య రంగాలతో పాటు రాష్ట్ర సమగ్రాభివద్ధికి కృషి చేస్తున్నారన్నారు.

జాతీయ రహదారి మండలానికే తలమానిక

ఎవ్వరు ఊహించని విధంగా ముదిగుబ్బ–బుక్కపట్నం–పుట్టపర్తి మీదుగా 342 జాతీయ రహదారి మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ రహదారి బుక్కపట్నం మండలానికే తలమానికగా నిలుస్తోందని గ్రామస్తులకు వివరించారు. ఈ రహదారితో మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న భూములకు ధరలు పెరగడంతో పాటు రవాణా సౌకర్యం మెరుగుపడుతోందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని కోరార. వెంటనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణయ్య, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప, మండల సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, నేలకోటప్ప, బాబురెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు విజయారెడ్డి, మాధవరెడ్డి, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటచౌదరి, మాజీ ఎంపీటీసీలు చెన్నారెడ్డి, మల్లేశ్, వైస్ సర్పంచ్ చెన్నప్ప, బొజ్జప్ప, నరసింహారెడ్డి, మనోహర్ రెడ్డి, కష్టారెడ్డి, ఫర్టిలైజర్ కేశవరెడ్డి, రామమోహన్, బ్రహ్మానందరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, కేశప్ప, పార్టీ మండల సమన్వయకర్తలు మల్లికార్జున, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు..

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన సాయిలీల గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సాయిలీల ఇప్పటి వరకూ ఉమ్మడి అనంతపురం జిల్లా మెప్మా అధ్యక్షురాలిగా ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



సచివాలయం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుకెళ్తున్నారని ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పులిగుండ్లపల్లి సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్లను సర్పంచులు సుగుణమ్మ, శ్రీరామ్‌రెడ్డి ,లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. శిలా ఫలకాలను ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. జగనన్న సంక్షేమ పథకాలతో పేదలు లబ్ధి పొందేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. చంద్రబాబునాయుడు ఓర్చుకోలేక పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రోగం వచ్చిందంటే 10 నుంచి 18 కిలోమీటర్ల దూరంలో వున్న మండల కేంద్రంలోని ఆసుపత్రికి రావాల్సి ఉండేదన్నారు. నేడు మన గ్రామంలో మన వద్దకే వైద్యం అందించే స్థితికి తెచ్చిన ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతులకు అన్ని రకాల సదుపాయాలతో పాటు మందులు సైతం తమ గ్రామాల్లోనే అందించే దిశగా రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫీనాయక్, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచులు సూర్యనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, విశ్రాంత ఆర్ఐ పాపిరెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకేబాబు, మండల అగ్రి బోర్డు చైర్మన్ చెన్నకృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ టోపీ రమణ, నిర్మాణ సహాయకులు చెన్నకృష్ణారెడ్డి, సుబ్బయ్య. ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు, ఏఓ షాదాబ్, దివాన్‌వలి పాల్గొన్నారు.

వెంకటరెడ్డి మృతి తీరనిలోటు



వెంకటరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మా వెంకటరెడ్డి మృతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కాటమకుంటలో వెంకటరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో అన్ని వర్గాల ప్రజలతో కలిసిమెలిసి ఉండేవారన్నారు. అలాంటి వ్యక్తి మనకు దూరం కావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సర్పంచులు సానే జయచంద్రారెడ్డి, చెన్నక్రిష్నారెడ్డి, మాజీ సర్పంచు గొల్లపల్లి నరసింహారెడ్డి, ముష్టూరు నరసింహారెడ్డి, లింగారెడ్డి, నాయకులు దొడ్డావుల బయపరెడ్డి, ఓంప్రసాద్‌రెడ్డి, చల్లా క్రిష్ణమనాయుడు, ముసలయ్య, హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి, బండి వీరనారప్ప, బండి నాగభూషణలతో పాటు తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఇరికిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇరికిరెడ్డి నారాయణరెడ్డి గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నారాయణరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి తండాలో పొలంబడి

ముదిగుబ్బ: మండల పరిధిలోని రామస్వామి తండాలో గురువారం వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌సీ డీడీఏ విద్యావతి, డీఆర్‌సీ ఏడీఏ సనావుల్లా, ఏడీఏ సత్యనారాయణ, ఏఓ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. రైతులతో పరస్పరం చర్చించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. పొలంబడిలో నమోదై సాగు చేసిన నాణ్యమైన పంటను ధ్రువీకరించి ప్రభుత్వం లేదా ప్రభుత్వ అనుబంధ సంస్థల ద్వారా అధిక ధరలకు విక్రయించుకునేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు నాగభూషణం, మినీబాయి పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం

ముదిగుబ్బ: ఇడుపుల పాయ నుంచి ఇచ్చాపురం వరకూ పాదయాత్ర చేస్తున్న బసవరాజు టీం గురువారం ముదిగుబ్బకు చేరుకుంది. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాదయాత్ర చేస్తున్న టీం సభ్యులకు సంఘీభావం తెలిపారు. వై నాట్ 175 నినాదంతో చేపట్టిన ఈ పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, నాయకులు కసిరెడ్డి కృష్ణారెడ్డి, చంద్రాయుడు, లోకేశ్వరెడ్డి, కిరణ్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డా.సిద్దారెడ్డి

నల్లచెరువు: మండల పరిధిలోని తవళంమర్రి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుధాకర్ తల్లి గౌరమ్మ (60) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గురువారం గ్రామానికి విచ్చేసి మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, నాయకుడు వై.రమణారెడ్డి, మోహన్, వలంటీర్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: నంగివాండ్లపల్లికి చెందిన రైతు ఎస్.ప్రహల్లాదరెడ్డి అప్పుల బాధతో పురుగుల మందు తాగి బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకుని, ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, మాజీ సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి, శీనానాయక్ పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

నల్లచెరువు: పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో పూజా సామగ్రి, టెంకాయలు, పూల హారాలు, పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునేందుకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ 20 వేలు డిపాజిట్‌గా చెల్లించాలన్నారు.

బాధితులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ

ధర్మవరం: ధర్మవరంలో పలువురు బాధితులకు గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ రూ.1.20 లక్షల ఆర్థికసాయం అందించారు. పట్టణంలోని 29వ వార్డులో చింతా రమణదాస్ కుమారుడు ధర్మతేజ విద్యుత్‌షాక్‌కు గురై బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారికి రూ.50 వేలు అందజేశారు. అలాగే 31వ వార్డుకు చెందిన మల్లెల శివానంద విద్యుత్‌షాక్‌తో మృతి చెందడంతో భార్య అపర్ణకు రూ.20 వేలు, వైఎస్సార్‌కాలనీలో నూతన శివాలయ నిర్మాణానికి రూ.50 వేలు అందజేశారు.

మోడల్ పేపర్ల సాధనతో ఉత్తమ మార్కులు



యూటీఎఫ్ రూపొందించిన పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

ధర్మవరం అర్బన్: పదో తరగతి విద్యార్థుల కోసం ముద్రించిన ఎస్ఎస్‌సీ–2024 మోడల్ టెస్ట్ పేపర్లు ప్రయోజనకరమని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఎంఈఓలు రాజేశ్వరి దేవి, గోపాల్‌నాయక్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం 25 సంవత్సరాల అనుభవం ఉన్న యూటీఎఫ్ ఉపాధ్యాయులతో టెస్ట్ పేపర్లను రూపొందించడం జరిగిందన్నారు. పరీక్షల్లో ఒక్కొక్క సబ్జెక్టు నుంచి దాదాపు 70 మార్కులకు పైగా ప్రశ్నలు వచ్చాయని.. ఒక్కో సబ్జెక్టుకు మూడు పేపర్లు సమాధానాలతో ఉంటాయని తెలిపారు. వీటిని బాగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు రామకృష్ణనాయక్, పట్టణ అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి సాయిగణేష్, జిల్లా మున్సిపల్ కన్వీనర్ బిల్లే రామంజినేయులు, నాయకులు నాగేంద్రకుమార్, రాంప్రసాద్, రామంజనేయులు, ఆదిశేషు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ధర్మవరం: వైఎస్సార్ విద్యార్థి విభాగ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎంపికైన వేముల అమర్‌నాథ్‌రెడ్డి గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగ్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, ప్రవీణ్ అల్లాడి, రాజశేఖర్‌రెడ్డి, భార్గవ్, నాగ, సిద్దిఖ్ తదితరులు పాల్గొన్నారు.

'అనీమియా'పై అవగాహన

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ లింగ వివక్ష నయా చేతన్ కార్యక్రమంలో భాగంగా అనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా.స్మిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వ్యాధిపై ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ల్యాబ్ అసిస్టెంట్ జాన్‌వెస్లీ వ్యాధి లక్షణాలు నివారణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో జనజాగృతి కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నల్లచెరువు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పాల్యం సుధాకర్ గురువారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

పుట్టపర్తి అర్బన్: ఈనెల 25 నుంచి 30 వరకూ తమిళనాడు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరగనున్న ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సురేష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బాబు, జగదీష్ ఎస్కే యూనివర్సిటీ తరపున పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసులు అభినందించారు.

ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాల మెరుగు

కనగానపల్లి: ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలను మరింత మెరుగు పరుస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సోలమన్ తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి డిప్యూటీ డీఎంహెచ్ఓ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి పనులు, సౌకర్యాలపై చర్చించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలంటే సరైన సౌకర్యాలతో పాటు ఆరోగ్య సిబ్బంది సక్రమంగా పనిచేయాలని ఎంపీపీ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, సర్పంచ్ అంకే పరిమళ, పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు వీడ్కోలు

పుట్టపర్తి అర్బన్: ఉద్యోగి జీవితంలో బదిలీ అనేది తాత్కాలికమని ఎక్కడికెళ్లినా వృత్తిలో రాణిస్తే మన్ననలు పొందవచ్చని పలువురు వక్తలు అన్నారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి ఉన్నత పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ అయ్యారు. గురువారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు వెంకటనాయుడు, రవీంద్రనాయక్, ఉమాదేవి, చంద్రశేఖర్, రామమోహన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఈశ్వరరెడ్డి, మనోహర్, నాగేంద్ర, బాబు, భక్త వత్సలం, ప్రభాకరరెడ్డి, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

ఓడీచెరువు: మండల పరిధిలోని కొండకమర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ.. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యపానం, ధూమపానం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

కండక్టర్లకు నగదు రివార్డులు

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీఈసీ డిపోలో నవంబర్ నెలంలో సంస్థకు అధిక ఆదాయం తీసుకొచ్చిన కండక్టర్లు శ్రీధర్, శ్రీనివాసరెడ్డికి రూ.500 చొప్పున నగదు రివార్డులు అందజేసినట్లు డీఎం మైనుద్దీన్ గురువారం తెలిపారు. డిపోలో పని చేస్తున్న కండక్టర్లందరూ ఉత్తమ ఆదాయం వచ్చేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు హరిమోహన్, హరిత, రామకృష్ణ పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

బత్తలపల్లి: విద్యార్థినులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం రాత్రి మండలంలోని సంజీవపురం వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో డ్రగ్స్, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి విద్యార్థిని దిశ యాప్‌ను తమ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుల్జార్ బేగం, కానిస్టేబుల్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని ధర్మపురి గ్రామానికి చెందిన సుబ్బమ్మ అనే మహిళ పాముకాటుతో తీవ్ర అస్వస్థతకు గురైంది. గురువారం ఆమె ఇంటి ముందు చెత్త ఊడ్చుతుండగా ప్రమాదవశాత్తూ పాము కాటువేసింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని రావులచెరువు గ్రామానికి చెందిన అక్కులప్ప గురువారం కుటుంబ కలహాలతో విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ధర్మవరంలో మహిళ..

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన నాగేంద్ర భార్య కవిత గురువారం రాత్రి కడుపునొప్పి తాళలేక థైరాయిడ్ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.